క్లుప్తంగా

విద్యార్థినికి అభినందన



విద్యార్థిని శ్రావ్యను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ప్రసాద్‌రావు

వెంకటాచలం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వెంకటాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల బైపీసీ ద్వితీయ సంవత్సర విద్యార్థిని బి.శ్రావ్య జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా శ్రావ్యను కళాశాల ప్రిన్సిపల్ వి.ప్రసాద్‌రావు సోమవారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాసరచన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపడంతో శ్రావ్య ప్రథమ స్థానంలో నిలిచి కలెక్టర్ ఎం.హరినారాయణన్ చేతుల మీదుగా రూ.25 వేల నగదు బహుమతి అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల వల్ల వేట కోల్పోతున్నాం

తోటపల్లిగూడూరు : తీర ప్రాంతాల్లో ప్రాజెక్టుల ఏర్పాటుతో మత్స్యకారులు వేట కోల్పోతున్నారని కోడూరు మత్స్యకార సొసైటీ ప్రెసిడెంట్ పామంజి గోవింద్ పేర్కొన్నారు. కోడూరు సముద్రతీరాన ఏర్పాటు కానున్న కేజ్ సీ కల్చర్ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా మత్స్యకార సొసైటీ సభ్యులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పామంజి గోవింద్ మాట్లాడుతూ తీరం వెంబడి ప్రాజెక్టుల కారణంగా వేట సక్రమంగా సాగక మత్స్యకారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మత్స్యకారులకు ఉపాధి కల్పించే ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తే తమ పూర్తి సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోడూరు పంచాయతీలోని మత్స్యకార కాపులు, పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పదహారు రోజుల పండగ

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెం, మహాత్మాగాంధీనగర్‌లోని శ్రీకృష్ణమందిరంలో అండాల్ గోదాదేవి, శ్రీకృష్ణుని పదహారు రోజుల పండగను సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భోగి పండగ నాడు దేవదేవేరుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అందులో భాగంగా పదహారు రోజుల పండగను సంప్రదాయంగా నిర్వహించారు. కల్యాణ వేదికపై సర్వాలంకారశోభితంగా కొలువై దేవదేవరులు భక్తులను అనుగ్రహించారు. మందిరం ప్రధాన అర్చకుడు బీ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు, ఊంజల్ సేవ నిర్వహించారు. ఉభయకర్తలుగా మణికల లక్ష్మీనరసింహయాదవ్, పద్మ, భాగవతుల విజయరాఘవేంద్ర, శైలజ దంపతులు వ్యవహరించారు. మందిర ధర్మకర్త చిత్తూరు వెంకటేశ్వర్లు, మందిర కమిటీ గౌరవాధ్యక్షుడు తిక్కవరపు శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు, వేణుగోపాల్, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

5, 6 తేదీల్లో ఖజానా ఉద్యోగుల క్రీడా పోటీలు

నెల్లూరు(దర్గామిట్ట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వచ్చే నెల 5,6 తేదీల్లో ట్రెజరీ ఉద్యోగుల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఖజానా శాఖ ఉపసంచాలకులు డీ గంగాద్రి తెలిపారు. అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఖజానా శాఖలో పనిచేసే ఉద్యోగులందరూ క్రీడల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఏటీఓలు బీ లోకేష్‌బాబు, ప్రసాద్, ఖాజానా ఉద్యోగ సంఘ నాయకులు డీ రమణారెడ్డి, గోడ సుబ్రహ్మణ్యం, పీ కిరణ్‌కుమార్, సయ్యద్ రెహమాన్, షేక్ జిలానీ, వై దయాకర్, వీవీ రమణరావు, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు బూడిద శ్రీనివాసులు, కే నరేంద్రబాబు, ఆర్ కొండలరావు, సాధు చంద్రశేఖర్, శివకాంత్ ప్రసాద్, ఆదిత్యవర్మ, పీవీ కిషోర్‌కుమార్, జీ అరుణమ్మ, బీ మమత తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ నంబర్లాటను కట్టడి చేయాలి

నెల్లూరు(క్రైమ్): కుటుంబాలను వీధుల పాల్జేస్తున్న సింగిల్ నంబర్లాటను కట్టడి చేయాలని సీపీఎం నగర నాయకులు కాయం శ్రీనివాసులు పోలీసు ఉన్నతాధికారులను కోరారు. ఈ మేరకు నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాయం శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో సింగిల్ నంబర్లాట చాపకింద నీరులా విస్తరిస్తోందన్నారు. ప్రధానంగా ముత్తుకూరుగేటు సెంటర్, బాలాజీనగర్, సంతపేట, కోటమిట్ట, పొర్లుకట్ట, ప్రగతినగర్, ఎన్టీఆర్‌నగర్, రాయపుపాళెం, తదితర ప్రాంతాల్లో జోరుగా సాగుతోందన్నారు. నిరుపేదలు రోజంతా కష్టపడిన సొమ్మును ఆటలో పెట్టి నష్టపోతున్నారని, ఫలితంగా కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని విన్నవించారు. స్పందించిన డీఎస్పీ సింగిల్‌నంబర్లాట నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున దాడులు చేసి అనేకమందిని కటకటాల వెనక్కి పంపామన్నారు. నగరంలో ఎక్కడైనా పేకాట, సింగల్ నంబర్లాటతో పాటు చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గుర్తిస్తే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందజేస్తే తగిన చర్యలు తీసుకుంటామని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

• ఎంపీ బీద మస్తాన్‌రావు



పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప సాంఘిక సంస్కర్త అని, సామాజిక న్యాయం ఆయనతోనే సాధ్యమైందని ఎంపీ బీద మస్తాన్‌రావు అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని డీఎల్ఎన్నార్ ఉన్నత పాఠశాలలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఇందులో పాల్గొన్న ఎంపీ మస్తాన్‌రావు మాట్లాడారు. అక్కచెల్లెమ్మలకు ఆసరా పథకం ద్వారా వరుసగా నాలుగో విడత వారి ఖాతాల్లో నగదు జమ చేయడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఆసరా పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదిగారన్నారు. ప్రజలకు అందుబాటులో కార్పొరేట్ వైద్యం, ఇంటింటికీ డాక్టర్ కార్యక్రమం లాంటివన్నీ పేద ప్రజల సంక్షేమం కోరి తీసుకొచ్చిన కార్యక్రమాలేనని తెలిపారు. ఇన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం ఎన్నికల సమయంలో కనిపించే పచ్చ నేతలను నమ్మవద్దని సూచించారు.

ప్రజలతోనే మా పొత్తు – ఎమ్మెల్యే ప్రసన్న

ప్రతిపక్ష పార్టీలన్నీ రకరకాల పొత్తులతో ఏకమైనా తమ పార్టీకి ఎలాంటి నష్టం లేదని ఎమ్మెల్యే ప్రసన్న అన్నారు. వైఎస్సార్‌సీపీ పొత్తు ప్రజలతోనే ఉంటుందన్నారు. తాము విశ్వసించేది ప్రజలనే తప్ప ఇంకెవరినీ నమ్మమన్నారు. కోవూరు నియోజకవర్గంలో 4,546 పొదుపు సంఘాల్లోని 44,869 మంది సభ్యులకు ఈ నాలుగు సంవత్సరాల్లో ఆసరా పథకం ద్వారా రూ.147.29 కోట్లు నేరుగా అకౌంట్లలో జమచేసి వారికి ఆర్థిక భరోసా ఇచ్చినట్లు తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలో 1,035 పొదుపు సంఘాల్లోని సభ్యులకు రూ.9.11 కోట్లు ఆసరా కింద జమ అయిందన్నారు. రాబోయే ఎన్నికల్లో పచ్చ నేతల ప్రలోభాలకు గురికాకుండా మరోసారి ఫ్యాన్ ప్రభంజనం సృష్టించేలా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతి, చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, పార్టీ నేతలు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ టౌన్, రూరల్ కన్వీనర్లు మల్లికార్జున‌రెడ్డి, చెర్లో సతీష్‌రెడ్డి, మండలాధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన మహిళలు

కొత్తూరులో జనసంద్రం



ఆసరా సంబరాలకు విశేషంగా హాజరైన మహిళలు

ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరులో సోమవారం జరిగిన వైఎస్సార్ ఆసరా సంబరాలకు మహిళలు పోటెత్తారు. దీంతో కొత్తూరు జనసంద్రంగా మారింది. కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో నమూనా చెక్కును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 34,443 పొదుపు సంఘాల్లోని 3,29,846 మంది మహిళల ఖాతాల్లో రూ.270.54 కోట్ల నిధులు జమ చేశారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి హామీని అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ముందుగా సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎంపీపీ గండ్లశ శంకరయ్య, ఉపాధ్యక్షులు కైలాసం లావణ్య, అద్దంకి మమత, పార్టీ నేతలు కె.శ్రీనివాసులురెడ్డి, వెంకురెడ్డి, విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు రక్త పరీక్షలు



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు : మండలంలోని చంద్రశేఖరపురం ఏకలవ్య గిరిజన ఆదర్శ గురుకుల పాఠశాల విద్యార్థులకు కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం రక్త పరీక్షలు నిర్వహించారు. తద్వారా హిమోగ్లోబిన్ శాతం తక్కువ ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ఐరన్ మాత్రలు ఇవ్వడంతో పాటు వైద్య సలహాలిచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ హిమోగ్లోబిన్ శాతం తగ్గితే రక్త హీనతకు దారి తీసి ప్రమాదకరంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియ, పీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ మెర్సీ, హెచ్ఏ షఫీ ఉద్దీన్, ఎంఎల్‌హెచ్‌పీ పద్మ, ఏఎన్ఎం రాధా పాల్గొన్నారు.

రైతుల ఫిర్యాదుపై అధికారుల పరిశీలన



వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

విడవలూరు : మండలంలోని అలగానిపాడు గ్రామంలో రైతుల ఫిర్యాదు మేరకు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలన చేపట్టినట్లు ఏఓ పి.వెంకటకృష్ణయ్య తెలిపారు. గ్రామానికి చెందిన కమలాకర్, కోదండయ్య బీపీటీ–5204 రకం వరి విత్తనాలు వేశారని, అవి కల్తీవనే సందేహం మేరకు పరిశీలన చేపట్టినట్లు వివరించారు. పొలంలోని వరిని సేకరించి పరిశోధన నిమిత్తం పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల అమ్మకంపై చర్యలు



మాట్లాడుతున్న ఏఓ జహీర్

మనుబోలు : మండలంలోని చెర్లోపల్లి గ్రామ రైతులకు నకిలీ విత్తనాలు అమ్మిన నెల్లూరుకు చెందిన కావేరి సీడ్స్ దుకాణం లైసెన్స్‌ను అధికారులు రద్దు చేసినట్లు మండల ఏఓ షేక్ జహీర్ తెలిపారు. ఆయన సోమ వారం తన కార్యాలయంలో మాట్లాడుతూ నకిలీ వరి విత్తనాల కారణంగా వరిపైరు ముందుగానే వెన్నుతీయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేయగా నెల్లూరు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు ఇటీవల వరిపైరును పరిశీలించి నకిలీ విత్తనా లు అని తేల్చిచెప్పినట్లు తెలిపారు. దీంతో కావేరి సీడ్స్ లైసెన్స్‌ను రద్దు చేస్తూ వ్యవసా య శాఖ వారు శనివారం నోటీ సు జారీ చేసినట్లు తెలిపారు.

పరిశుభ్రత ఎంతో ముఖ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ జ్యోతి

కోవూరు : అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఎంతో ముఖ్యమని సీడీపీఓ జ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో కోవూరు సెక్టార్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెలా పిల్లల ఎత్తు, బరువును కచ్చితంగా లెక్కించి నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా పిల్లలకు ఆట, పాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. ప్రభుత్వం ద్వారా అందే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా చిన్నారులకు అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

సంబంధిత పత్రాలు తీసుకురావాలి



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ రవిబాబు

కోవూరు : సదరం పరీక్షలకు వచ్చే రోగులు తప్పనిసరిగా సంబంధిత ఆరోగ్య పత్రాలను తీసుకురావాలని ఆర్థోపెడిక్ డాక్టర్ రవిబాబు తెలిపారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం జరిగిన సదరం క్యాంప్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. సదరం ఆరోగ్య సేవలకు వచ్చే రోగులు ముందుగా మీసేవలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని, తర్వాత వారి సెల్ ఫోన్‌కు వచ్చే మెసేజ్‌ను జెరాక్స్ తీసుకోవాలన్నారు. వీటితో పాటు రోగికి సంబంధించిన ఆధార్ కార్డు, ధ్రువీకరణ పత్రాలు, ఎక్స్‌రేలు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. కాగా సోమవారం జరిగిన క్యాంపులో 11 మంది నమోదు చేసుకోగా అందరూ హాజరయ్యారు.

నేడు మనుబోలుకు మంత్రి కాకాణి రాక

• ఆసరా చెక్కుల పంపిణీ

మనుబోలు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం మనుబోలుకు రానున్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వైఎస్సార్ ఆసరా చెక్కులను మంత్రి పంపిణీ చేస్తారని ఎంపీడీఓ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పొదలకూరు : పట్టణ పరిధిలో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ శ్రీకాంత్ సోమవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

వార్డు మెంబర్ మృతికి నివాళి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడ గ్రామ పంచాయతీ రెండో వార్డు మెంబర్ ఎం.చిట్టిబాబు (40) అనారోగ్య కారణాలతో సోమవారం మృతి చెందారు. మాజీ సర్పంచ్ పి.మురళి, వైస్ ఎంపీపీ బాలకృష్ణ, సాగర్, శివ ఆయన మృతదేహం వద్ద నివాళి అర్పించారు.

ప్రత్యేక కృతజ్ఞతలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని డీఎల్ఎన్నార్ పాఠశాల ఆవరణలో సోమవారం జరిగిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం విజయవంతం చేసినందుకు టౌన్, రూరల్ వైఎస్సార్ సీపీ కన్వీనర్లు మల్లికార్జునరెడ్డి, సతీష్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారు సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పొదుపు గ్రూపు సభ్యులు, మెప్మా, రిసోర్స్ పర్సన్లు, నగర పంచాయతీ సిబ్బంది, అధికారులు, నాయకులు, కార్యకర్తల సహకారంతో కార్యక్రమం విజయవంతంగా జరగడం సంతోషంగా ఉందన్నారు.

విద్యార్థి విభాగం మండలాధ్యక్షుడిగా నితీష్

వెంకటాచలం: వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం మండలాధ్యక్షుడిగా గంగాల నితీష్ యాదవ్‌ను నియమించారు. చెముడుగుంట గ్రామానికి చెందిన నితీష్ యాదవ్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. దీంతో అతన్ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విద్యార్థి విభాగం మండలాధ్యక్షుడి నియమించారు.

వినతుల స్వీకరణ

పొదలకూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కె.వీరవసంతరావు సోమవారం రైతుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. పట్టాదారు పాసుపుస్తకాలు, భూ వివాదాలు, అసైన్‌మెంట్ భూములు తదితర సమస్యలపై వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు అర్జీలను అందజేశారు.

నేటి ఆసరా వేడుక వాయిదా

విడవలూరు : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరగాల్సిన వైఎస్సార్ ఆసరా వేడుకల కార్యక్రమం వాయిదా పడిందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఎంపీపీ వేణుంబాక భవానమ్మ ఆకస్మికంగా మృతి చెందడం వల్ల వాయిదా పడినట్లు తెలియజేశారు.

సోమిరెడ్డి మరోసారి నవ్వులపాలు



మంత్రి కాకాణి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు

వెంకటాచలం: సర్వేపల్లి నియోజకవర్గంలో ఉనికి కోసం సోమిరెడ్డి చేస్తున్న దిగజారుడు రాజకీయాలు ఆయన్ను మరింత నవ్వులపాలు చేస్తున్నాయి. వరుస ఓటములు ఒక వైపు, వైఎస్సార్ సీపీ ప్రభంజనం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఉన్న ప్రజామద్దతు వల్ల ఈ దఫా సర్వేపల్లి టికెట్ దక్కుతుందో లేదో అనే ఆందోళనతో గ్రామాల్లో కనిపించిన ప్రతి ఒక్కరికీ కండువాలు కప్పుతూ టీడీపీలో చేరికలంటూ ప్రచారాలు చేసుకుంటున్నాడు. అయితే సోమిరెడ్డి ప్రకటించిన రెండు రోజుల వ్యవధిలోనే తాము వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతామని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వద్ద స్పష్టం చేయడంతో సోమిరెడ్డి నవ్వుల పాలవుతున్నాడు. వెంకటాచలం మండలం పాలిచెర్లపాడులో టీడీపీలో చేరికలంటూ సోమిరెడ్డి ప్రకటించిన వారిలో కొంత మంది రెండు రోజుల క్రితం మంత్రి కాకాణి వద్దకు వచ్చి తాము వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతామని చెప్పడం తెలిసిందే. తాజాగా సోమిరెడ్డి ప్రకటించిన వారిలో మరికొందరు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సోమవారం రాత్రి కలిసి తాము వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతామని చెప్పారు. దీనివల్ల పాలిచెర్లపాడు గ్రామానికి చెందిన కొందరు టీడీపీ కార్యకర్తలు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ విషయం తెలిసిన టీడీపీ నేతలు సోమిరెడ్డి తీరుపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

క్రీడాకారులకు అభినందన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కోవూరు నియోజకవర్గ స్థాయిలో ఇటీవల జరిగిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో గెలుపొందిన వారిని ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం అభినందించారు. స్థానిక డీఎల్ఎన్నార్ పాఠశాలలో కార్యక్రమం జరిగింది. క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ తదితర ఆటల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు మెమెంటోలు అందజేశారు. జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో కూడా సత్తా చాటాలని వారు కోరారు.

నైపుణ్యాలను వెలికి తీయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ చెంచులక్ష్మమ్మ

కోవూరు : ప్రాథమిక దశ నుంచి విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి –2 వై.చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరు మండలం పాటూరు పంచాయతీ పరిధిలోని పల్లిపాళెం, చెంచమ్మతోపు, చెక్కిరాల దిబ్బ ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేలా సంబంధిత పాఠశాలల హెచ్ఎంలు తగిన చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి విద్యార్థులతో ప్రత్యేకంగా చర్చించారు.

బైపాస్‌రోడ్డు పనులపై ఆరా



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీనగర్ రోడ్డు వరకు రూ.కోటి నిధులతో నిర్మిస్తున్న బైపాస్‌రోడ్డు పనులను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

కిక్ బాక్సింగ్‌లో బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

ముత్తుకూరు : ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ లీగ్‌లో గోపాలపురంలోని అదానీ వరల్డ్ స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ సత్యనారాయణ సోమవారం తెలిపారు. కర్నూలు వేదికగా ఈనెల 27, 28వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 10 జిల్లాల నుంచి 30 పాఠశాలలకు చెందిన సుమారు 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో పలు విభాగాల్లో తమ స్కూల్‌కు చెందిన ఆరో తరగతి విద్యార్థిని సృష్టి, ఏడో తరగతి విద్యార్థిని లాస్యప్రియ, సోమిని బంగారు పతకాలు సాధించారని చెప్పారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలను ఉపాధ్యాయులు అభినందించారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

కొడవలూరు : అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి మండలంలోని యల్లాయపాళేనికి చెందిన ఎస్ఎస్ఎన్‌పీ(స్టాండ్‌బై సపోర్ట్ ఫర్ నీడీ పీపుల్) ఫౌండేషన్ ఆర్థిక సాయమందించింది. కోవూరు మండలం ఇనమడుగుకు చెందిన కె.పెంచలయ్య లివర్ సమస్యతో బాధపడుతున్నారు. వైద్యులను సంప్రదించగా శస్త్ర చికిత్స అనివార్యమని, అందుకు రూ.1.60 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన పెంచలయ్య వైద్యం కోసం తమ వంతుగా ఫౌండేషన్ సభ్యులు సోమవారం రూ.20 వేలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి సాయపడాలని విజ్ఞప్తి చేశారు.

నేడు త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవం

నెల్లూరు(బృందావనం): పుష్య బహుళ పంచమి సందర్భంగా వేదాయపాళెం, త్యాగరాజనగర్‌లోని సద్గురు త్యాగరాజస్వామి మందిరంలో త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు త్యాగరాజ సేవా సమితి నిర్వాహకులు ఎనమంద్ర నాగదేవిప్రసాద్ సోమవారం తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విశేషాభిషేకాలు, అర్చనలు, నగర సంకీర్తన, పంచరత్న కీర్తనల గానం, బ్రహ్మశ్రీ మాచవోలు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఆరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు.